సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 23 । అక్టోబర్‌ । 2023



వారిని ప్రజలు నమ్మరు

కారును, కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరని మహేశ్వరం బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములుయాదవ్‌ అన్నారు. 10లో ▸



బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం

బీఆర్‌ఎస్‌తోనే అన్ని విధాలా సంక్షేమ పాలన సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌ యాదవ్‌ అన్నారు. 10లో ▸



గెలుపు కోసం కృషి చేయాలి

కాంగ్రెస్‌ గెలుపుకోసం అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని షాద్‌నగర్‌ అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌ పిలుపునిచ్చారు. 10లో ▸



కడ్తాల్‌: బతుకమ్మతో యువతి

సద్దుల సంబురం

సద్దుల బతుకమ్మను ఆడపడుచులు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. అందంగా ముస్తాబై తీరొక్క పూలతో బతుకమ్మలను చూడముచ్చటగా పేర్చి ఊరేగింపుగా వెళ్లారు. పల్లె, పట్టణ చౌరస్తాలు.. ఆలయాల వద్దకు అన్నింటినీ ఒకచోటికి చేర్చి బతుకమ్మ పాటలతో హోరెత్తించారు. చివరగా ఆయా చెరువుల్లో వాటిని నిమజ్జనం చేశారు. ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది.



ఆమనగల్లు: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మహేశ్వరం: బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

న్యూస్‌రీల్‌

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్‌ ప్రభుత్వమే

తమిళనాడు ఎంపీ డాక్టర్‌ విష్ణుప్రసాద్‌



సమావేశంలో విష్ణుప్రసాద్‌ తదితరులు

చేవెళ్ల: తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్‌ ప్రభుత్వమేనని కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని తమిళనాడు ఎంపీ, చేవెళ్ల పార్లమెంట్‌ ఇన్‌చార్జి డాక్టర్‌ విష్ణుప్రసాద్‌ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం రాత్రి ఆయన నియోజకవర్గ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్‌పార్టీ గాలి వీస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేసేలా ఉన్నాయన్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పేర్కొన్నారు. పార్టీ అభ్యర్థి పామెన భీంభరత్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్‌ నాయకులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. న్యాయం చేస్తాం



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి

మొయినాబాద్‌: భవిష్యత్‌ మనదే.. పార్టీకోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ అన్నారు. మండలానికి చెందిన బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొంపల్లి అనంతరెడ్డి తనకు అవకాశాలు దక్కడంలేదని.. పార్టీలో తగిన న్యాయం జరగడంలేదని కినుక వహించి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అనంతరెడ్డిని తీసుకుని మంత్రి కేటీఆర్‌ను కలిశారు. అనంతరెడ్డి తన ఆవేదన మంత్రికి తెలియజేశారు. స్పందించిన ఆయన త్వరలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని సూచించారు.

విజయదశమి శుభాకాంక్షలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చెడుపై మంచి సాధించిన విజయమే దసరా అని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల గనుల శాఖ మంత్రి డాక్టర్‌ పట్నం మహేందర్‌ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ విజయదశమి ప్రజలందరి జీవితాల్లో విజయాలు నింపాలని, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రైతులు, మహిళలు, యువత, వ్యాపారులు సుఖ శాంతులతో, అష్ట ఐశ్వర్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు.

ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విజయదశమిని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్‌ భారతి హోళికేరి శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ అందరి జీవితాల్లో విజయాలు సమకూర్చాలని, చేపట్టిన ప్రతీకార్యం సఫలీకృతం కావాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల వారు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో జీవించాలని అభిలషించారు.

కమలం.. 'తొలి' దళం



అందెల శ్రీరాములు యాదవ్‌



నోముల దయానంద్‌ గౌడ్‌



తల్లోజు ఆచారి



- బీజేపీ ఫస్ట్‌ లిస్టులో ముగ్గురికి చోటు
- మహేశ్వరం అభ్యర్థిగా అందెల
- ఇబ్రహీంపట్నం నుంచి దయానంద్‌గౌడ్‌
- కల్వకుర్తి అభ్యర్థిగా ఆచారి పేరు ఖరారు
- మిగిలిన స్థానాలకు దసరా తర్వాత ప్రకటించే చాన్స్‌

సాక్షి, రంగారెడ్డిజిల్లా: బీజేపీ తొలి జాబితాలో మహేశ్వరం, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయి. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్‌ సహా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆయా నియోజకవర్గాల అభ్యర్థులకు వ్యక్తిగతంగా ఫోన్‌ చేసి ప్రచారాన్ని ముమ్మరం చేయాలని సూచించారు. మహేశ్వరం నుంచి అందెల శ్రీరాములు యాదవ్‌, ఇబ్రహీంపట్నం నుంచి నోముల దయానంద్‌గౌడ్‌, కల్వకుర్తి నియోజకవర్గానికి జాతీయ బీసీ కమిషన్‌ మాజీ సభ్యుడు ఆచారి పేరును ఖరారు చేశారు. మిగిలిన వారిని రెండో జాబితాలో ప్రకటించనున్నట్లు తెలిసింది.

మహేశ్వరం నియోజకవర్గం

అభ్యర్థి:	అందెల శ్రీరాములు యాదవ్‌
తల్లిదండ్రులు:	అందెల ఆగమయ్య యాదవ్‌
పుట్టిన తేదీ:	4-5-1976
భార్య :	ఆండాలు
పిల్లలు:	సోని, శిరీష, క్రిష్‌
సొంతూరు:	నాదర్‌గూల్‌
విద్యార్హత:	బీఏ, పొలిటికల్‌ సైన్స్‌
రాజకీయ నేపథ్యం:	మొదటి నుంచి బీజేపీ అభిమాని.

2018 ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి పార్టీ తరపున పోటీ చేసి, 39,445 ఓట్లు సాధించారు. జీహెచ్‌ఎంసీ సహా మున్సిపల్‌ కార్పొరేషన్‌, ఇతర స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ సీట్లలో పార్టీ కార్యకర్తలను గెలిపించుకోగలిగారు. సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారు. మహేశ్వరం నియోజకవర్గం నుంచి ఆయన రెండో సారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

ఇబ్రహీంపట్నం..

అభ్యర్థి:	నోముల దయానంద్‌గౌడ్‌
తల్లిదండ్రులు:	అంతయ్య, సుశీల
వయసు:	58
భార్య:	జయలక్ష్మి
పిల్లలు:	కార్తీక్‌, భరత్‌, జ్యోతిరాణి
సొంతూరు:	ఇంజాపూర్‌
విద్యార్హత:	ఇంటర్మీయట్‌
రాజకీయ నేపథ్యం:	మొదట్లో కాంగ్రెస్‌లో పని చేశారు.

2013లో ఇంజాపూర్‌ సర్పంచ్‌గా ఎంపికయ్యారు. 2014లో టీఆర్‌ఎస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో హయత్‌నగర్‌, సిటీ ఆర్టీసీ యూనియన్‌కు గౌరవ అధ్యక్షుడిగా పని చేశారు. అధికారపార్టీ ఎమ్మెల్యేతో విభేదించి మూడేళ్ల క్రితం బీజేపీలో చేరారు. తాజాగా బీజేపీ అభ్యర్థిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి పోటీ చేయబోతున్నారు.

కల్వకుర్తి ..

అభ్యర్థి:	తల్లోజు ఆచారి
తల్లిదండ్రులు:	కమలమ్మ, రాములు
పుట్టినతేదీ:	1966 జూన్‌ 6
భార్య:	గీత
పిల్లలు:	భరత్‌, పావని
విద్యార్హత:	బీఏ
సొంతూరు:	ఆమనగల్లు
రాజకీయ నేపథ్యం:	1984లో రాజకీయరంగ ప్రవేశం.

ఆమనగల్లు పంచాయతీ వార్డు సభ్యుడిగా, సర్పంచ్‌గా ఎన్నిక. జిల్లా బీజేవైఎం అధ్యక్షుడిగా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, ప్రధాన కార్యదర్శిగా వివిధ హోదాల్లో పని చేశారు. 2019 నుంచి జాతీయ బీసీ కమిషన్‌ సభ్యుడిగా మూడేళ్ల పాటు పని చేశారు. 1994లో కల్వకుర్తి నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2004, 2008, 2014, 2018లోనూ ఓడిపోయారు.



కడ్తాల్‌: మైసిగండి మైసమ్మ ఆలయంలో

దుర్గాదేవిగా అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయా ఆలయాల్లో ఆదివారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆమనగల్లు: వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ..



యాచారం: నందివనపర్తి జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో..



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో..

బీఆర్‌ఎస్‌ అభ్యర్థికి నిరసన సెగ



సమస్యలపై ఎమ్మెల్యే కాలె యాదయ్యను నిలదీస్తున్న గ్రామస్తులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ సిట్టింగ్‌ అభ్యర్థి కాలె యాదయ్యకు నిరసన సెగ తగిలింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన మొయినాబాద్‌ మండల పరిధిలోని ఎత్‌మార్‌పల్లి, నక్కలపల్లి, తోల్‌కట్టల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. నక్కలపల్లి ఈసీ వాగుపై వంతెన నిర్మాణం, ఎత్‌మార్‌పల్లికి బస్సు సౌకర్యం లేదని, తోల్‌కట్టలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఆయా సమస్యలు తీర్చిన తర్వాతే తమ గ్రామాల్లో ప్రచారాన్ని చేపట్టాలని పట్టుబట్టారు. ఈ సమయంలో గ్రామస్తులకు, ఆయనకు మధ్య వాగ్వాదం కొనసాగింది. రోడ్ల దుస్థితిపై కూడా ఆయన్ను నిలదీశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, ఇప్పటికీ పనులు పూర్తి చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో మళ్లీ తనను గెలిపించాలని, ఆ తర్వాత అన్ని సమస్యలకు పరిష్కార మార్గం చూపుతానని ఆయన హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. ఆ తర్వాత ఆయన యథావిధిగా ప్రచారం కొనసాగించారు.

వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య
- ఆలస్యంగా వెలుగులోకి..
- భార్య, ప్రియుడు, మరో వ్యక్తి రిమాండ్‌

మీర్‌పేట: వివాహేతర సంబంధం పెట్టుకున్నందుకు భర్త మందలించగా భార్య తన ప్రియుడు, మరో వ్యక్తితో కలిసి భర్తను హతమార్చిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి వివరాలు వెల్లడించారు. వనపర్తి జిల్లాకు చెందిన చిన్నపాగ రాములు (35), కేశమ్మ (మహేశ్వరి) బతుకుదెరువు కోసం మీర్‌పేట అల్మాస్‌గూడకు వచ్చి అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. రాములు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మహేశ్వరి బంధువు అయిన లారీ డ్రైవర్‌గా పనిచేసే జిల్లెలగూడలో నివసించే మంచాల రాముతో చనువుగా ఉంటోంది. ఇది గమనించిన భర్త పలుమార్లు మందలించగా విషయాన్ని ప్రియుడు రాముకు తెలిపింది. అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని, ఎలాగైనా అంతమొందించాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం మహేశ్వరి నాలుగు రోజుల క్రితం పిల్లలతో కలిసి సొంత గ్రామానికి వెళ్లిపోగా, రాము తెల్లపోగు దూలయ్యతో కలిసి ఈ నెల 20న అర్ధరాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న రాములుపై గొడ్డలితో దాడి చేశారు. గొంతు, తలపై తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే అతను మృతి చెందాడు. ఆదివారం ఉదయం గది నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు రాము, దూలయ్య, మహేశ్వరిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు.

వేడుకకు వేళాయె..

- నేడు విజయదశమి
- ముస్తాబైన ఆలయాలు
- వాహన పూజలకు సిద్ధం
- అలయ్‌ బలయ్‌, పాలపిట్ట దర్శనం
- పలు ప్రాంతాల్లో రావణ దహనాలు
- ఓటర్లకు దసరా ధమాకా!

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విజయాలకు ప్రతీకగా నిలిచే విజయ దశమి వేడుకలకు జిల్లా సర్వం సిద్ధమైంది. ఇప్పటికే జిల్లాలోని ప్రధాన అమ్మవారి ఆలయాలను నిర్వాహకులు అందంగా ముస్తాబు చేశారు. తొమ్మిది రోజులుగా, తొమ్మిది అవతారాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు సోమవారం శాంతి స్వరూపిణిగా భక్తులకు దర్శనమివ్వనుంది. పల్లె, పట్టణం, పేద, ధనిక తేడా లేకుండా విజయదశమి రోజు సాయంత్రం ఊరి కోట బురుజు, గ్రామ పంచాయతీ కార్యాలయం, క్రీడా మైదానాల వద్దకు చేరుకుని ×జయ జయహే మహిషాసుర మర్దిని రమ్యక వర్దిని శైలశుతే₹ అంటూ అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించనున్నారు. చెడుపై మంచి సాధించిన విజయాలకు చిహ్నంగా 'రావణ దహనం' కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అన్ని పార్టీల అభ్యర్థులు వేడుకను వేదికగా మలుచుకుంటున్నారు. దసర దావత్‌ పేరుతో ఇప్పటికే మండల, డివిజన్‌, గ్రామశాఖ, బూత్‌ల కేడర్‌కు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. ముఖ్యమైన నాయకులకు టూ వీలర్‌, ఫోర్‌ వీలర్‌ వాహనాలు, ఖరీదైన సెల్‌ఫోన్లు అందజేశారు. గ్రామాలు, బస్తీల్లోని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మగ వారికి మద్యం బాటిళ్లను సరఫరా చేశారు.



ఆలయాల ముందు వాహనాల క్యూ

మహాభారతంలో పాండవులు జమ్మిచెట్టు నుంచి ఆయుధాలు దించి పూజలు చేశారట. ఆనాటి నుంచి ఆయుధ పూజ ఆనవాయితీగా వస్తోంది. పిల్లలు తమ పుస్తకాల నుంచి రైతులు నాగళ్ల దాకా, పోలీసుల చేతిలో కన్పించే తుపాకీ నుంచి యుద్ధ విమానాల వరకు, కూలీ పనులు చేసేవాళ్లు, కులవృత్తుల వాళ్లు, వ్యాపారులు అంతా తమ వద్ద ఉన్న ఆయుధాలను పూజించి గౌరవిస్తుంటారు. సైకిల్‌ నుంచి ట్రాక్టర్‌ వరకు అన్ని వాహనాలకు విజయదశమి రోజు పూజలు చేస్తుంటారు. జిల్లాలోని మైసిగండి దేవాలయం, మాసబ్‌ చెరువు కట్టపై వెలసిన అమ్మవారి దేవాలయం సహా తుక్కుగూడలోని ఎల్లమ్మ దేవాలయం, కర్మన్‌ఘాట్‌ ఆంజనేయ స్వామి వంటి ప్రముఖ దేవాలయాల ముందు పూజల కోసం వాహన దారులు క్యూ కడుతున్నారు.

జమ్మి ఆకుతో అలయ్‌..బలయ్‌

'శమీ శమైతే పాపం..శత్రు వినాశనం..' అంటూ దసరా రోజు సాయంత్రం గుడి ముందు జమ్మి చెట్టుకు పూజ చేస్తుంటారు. జమ్మి ఆకును ×బంగారం₹గా పంచుకుంటూ అలయ్‌..బలయ్‌ చేసుకోవడం ఆనవాయితీ. విజయ దశమి రోజు తప్పనిసరిగా పాలపిట్టను చూడాలని చెబుతుంటారు. సాయంత్రం జమ్మిచెట్టుకు పూజలు చేసి, అనంతరం పాలపిట్ట దర్శనానికి వెళ్తుంటారు. అమ్మవారి అనుగ్రహం లభించి, దోషాలు తొలగి పనిలో విజయం దక్కుతుందని నమ్ముతుంటారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పాలన

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే జెడ్పీటీసీ సభ్యుడు దశరథనాయక్‌తో కలిసి బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు మోసం చేసేందుకు గ్రామాలకు వస్తున్నారని ప్రజలు వారికి బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్‌కు వెన్నుపోటు పొడిచిన కసిరెడ్డికి నియోజకవర్గ ప్రజలు త్వరలోనే గుణపాఠం చెబుతారన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మూడు గంటల కరెంటు మాత్రమే వస్తుందని.. కారు గుర్తుకు ఓటు వేస్తే మూడు పంటలకు కరెంటు అందుతుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు చైతన్యవంతులని ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే వారు తిరిగి పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు వీరయ్య, లచ్చిరామ్‌నాయక్, గోపాల్, రమేశ్, చంద్రమౌళి, లాయక్‌అలీ, గంపశ్రీను, రంగయ్య, రామకృష్ణ, నర్సింహ, నరేందర్‌రెడ్డి, భిక్షపతి, మహేశ్, అశోక్, రాంచంద్రయ్య, కృష్ణ, ఇర్షాద్ తదితరులున్నారు.

'కారు'ను, కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరు

- కమలం గుర్తుకు ఓటేసి ఆశీర్వదించండి
- బీజేపీ మహేశ్వరం అసెంబ్లీ అభ్యర్థి అందెల శ్రీరాములు



అందెల శ్రీరాములు ఆధ్వర్యంలో బీజేపీలో చేరుతున్న యువత

హుడాకాంప్లెక్స్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందేలా కృషి చేస్తానని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. ఆదివారం సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు సిద్దు ముదిరాజ్ ఆధ్వర్యంలో రజక సంఘం ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. బీసీ, దళితబంధు, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వకుండా ఓట్ల కోసం వస్తే బీఆర్‌ఎస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. రజక ప్రజాప్రతినిధులు ఎక్కువగా బడంగ్‌పేట, మీర్‌పేట కార్పొరేషన్లతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీలోనే ఎక్కువ మంది ఉన్నారని గుర్తుచేశారు. ఎవరు డబ్బులు ఇచ్చినా తీసుకుని బీజేపీకి ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సురేశ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ప్రవీణ్, శివ, సురేశ్ ముదిరాజ్, జంగయ్య, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కమలంలో చేరికలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో ఆదివారం బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ సమక్షంలో పలువురు యువకులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కాషాయ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని అన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు రాకేశ్, మిట్టు, వంశీ వివేక్, దిలీప్, దినేశ్, రాజు, భరత్ తదితరులున్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బాషయ్య



బాషయ్యను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మంచాల: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా చిత్తాపూర్ గ్రామానికి చెందిన దన్నె బాషయ్యను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బాషయ్యను ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు గోవర్ధన్‌చారి, మండల ఇన్‌చార్జి పాండాల జంగయ్యగౌడ్ ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బాషయ్య పార్టీ కోసం కష్టపడి పని చేయడమే కాక సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా, మంచాల వైస్ ఎంపీపీగా ప్రజలకు సేవ చేశారని గుర్తు చేశారు. పార్టీ ఆయన సేవలను గుర్తించి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించిందన్నారు. అనంతరం బాషయ్య మాట్లాడుతూ.. పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శక్తి వంచన లేకుండా నిర్వర్తిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, పాండు, రాజు, రాజేందర్‌రెడ్డి, భిక్షపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాష్ట్ర అభివృద్ధి



షాద్‌నగర్: పార్టీలో చేరిన నేతలతో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్: బడుగ బలహీన వర్గాల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి, మధురాపూర్ గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరగాలంటే రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

షాద్‌నగర్‌రూరల్: దేవాలయాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట అంబాభవానీమాత ఆలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీర్ణావస్థలో ఉన్న ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ లక్షల రూపాయల నిధులను మంజూరు చేశారని అన్నారు. ఆలయాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి భక్తులకు అన్ని వసతులను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో.. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆదివారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అమ్మవారికి గజమాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డ్రగ్స్ విక్రేతకు రిమాండ్

నిందితుడి వద్ద 3.5కిలోల హాష్ ఆయిల్ స్వాధీనం

మీర్‌పేట: సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రూ.17.50లక్షల విలువైన నిషేధిత హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మీర్‌పేట్ పీఎస్‌లో కేసు వివరాలు వెల్లడించారు. వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి తెలిపిన ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలం బ్రాహ్మణపల్లికి చెందిన బొబ్బ సూర్యప్రకాశ్ కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో భద్రాచలంకు చెందిన పోతురాజుతో పరిచయం ఏర్పడింది. ఆయన వద్ద రూ.7లక్షలకు 3.5 కిలోల హాష్ ఆయిల్ కొనుగోలు చేశాడు. దీన్ని సంతోష్‌నగర్‌లో విక్రయించేందుకు ఈ నెల 21న పీఎస్ పరిధిలోని మందమల్లమ్మ ప్రాంతానికి వచ్చాడు. అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు విచారించగా హాష్ ఆయిల్ విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు నిందితుడి వద్ద హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ సమావేశంలో సీఐ కిరణ్‌కుమార్, ఎస్‌ఐ గోవిందస్వామి సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలి

షాద్‌నగర్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్



పార్టీలో చేరిన వారితో వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ షాద్‌నగర్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం మైనార్టీ నేత జమ్రుద్‌ఖాన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నుంచి దాదాపు 80 మంది యువకులు హస్తం గూటికి చేరారు. వారికి శంకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ ఓటర్లను ఆకర్షించేలా ప్రచార అస్త్రాలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. పార్టీ ప్రకటించిన డిక్లరేషన్లు, నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపిందని తెలిపారు. బీఆర్‌ఎస్ అవినీతి, అక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని కోరారు. కల్వకుంట్ల కుటుంబం కమీషన్ల పేరుతో లక్షల కోట్ల రూపాయలు దోచుకుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్టాలో ప్రకటనతో మోసం

ఉద్యోగం ఆశ చూపి రూ.97,581 దోచేసిన వైనం

శంషాబాద్‌రూరల్: సోషల్ మీడియా ఇన్‌స్టాలో వర్క్ ఫ్రమ్‌హోం ప్రకటన చూసి ఆశపడిన ఓ యువకుడు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయాడు. అతడి నుంచి కేటుగాళ్లు రూ.97,581ని దోచేశారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌గూడకు చెందిన ఆరె భాస్కర్ (21) తన ఫోన్‌లో ఈనెల 21న ఇన్‌స్టాగ్రాం చూస్తున్నాడు. ఈ క్రమంలో వర్క్‌ఫ్రం హోం ప్రకటన చూసి అక్కడ ఉన్న లింక్ తెరిచి రిజిస్టర్ చేసుకున్నాడు. పోర్టల్ ఇంటర్‌ఫేస్‌లో రీచార్జ్‌పై పెట్టుబడి, ప్రతిఫలంగా డబ్బులు సంపాదించవచ్చని సైబర్ నేరగాళ్లు చెప్పడంతో మొదట రూ.200 పెట్టుబడి పెట్టాడు. మరోసారి రూ.1,620, ఇలా మొత్తంగా పలు దఫాలుగా రూ.97,581 ఇన్వెస్ట్ చేశాడు. ఈ డబ్బులు రావడానికి పన్ను చెల్లించాలంటూ నేరగాళ్లు చెప్పడంతో తాను మోస పోయినట్లు గుర్తించాడు. ఆదివారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేతపై హర్షం

అత్తాపూర్: బీజేపీ ఫైర్ బ్రాండ్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేసిన బీజేపీ జాతీయ నాయకత్వానికి, రాష్ట్ర నాయకులకు అత్తాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సాయియాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ అధిష్టానం నిర్ణయం కోసం ఎన్నాళ్లగానో ఎదురు చూస్తున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సస్పెన్షన్ ఎత్తివేస్తునట్లు గుడ్ న్యూస్ తెలియజేసిన బీజేపీ అధిష్టానానికి, రాష్ట్ర పార్టీ నాయకులు సాయియాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.